# కేసీఆర్ పాలనలో విద్యారంగానికి పెద్దపీట

- సంగారెడ్డిలో మెడికల్, నర్సింగ్ కాలేజీల ఏర్పాటు
- దేశంలో మొట్టమొదటి గిరిజన గురుకుల లా కాలేజీ సంగారెడ్డిలోనే...
- అగ్రికల్చర్ ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీలు
- పాఠశాల, కళాశాల విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యం
- మన ఊరు-మనబడితో పాఠశాలల పునరుద్ధరణ
- అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లంలో బోధన
- సన్నబియ్యంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం
- జిల్లాలో 44 గురుకుల పాఠశాలు, కళాశాలలు
- సంగారెడ్డి, నారాయణఖేడ్‌లో సైన్స్ మ్యూజియాలు ఏర్పాటు



సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన గిరిజన గురుకుల లా కళాశాల

సంగారెడ్డి, జూన్ 19 (నమస్తే తెలంగాణ): విద్యారంగంలో సంగారెడ్డి జిల్లా దూసుకెళ్తున్నది. ఉమ్మడిపాలనలో సంగారెడ్డి జిల్లాలో విద్యారంగం వెనకబడి ఉండేది. సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చాక సంగారెడ్డి జిల్లాలో విద్యారంగం అభివృద్ధి చెందింది. సీఎం కేసీఆర్ కేజీ టు పీజీ విధానం అమలులోకి తీసుకురావటంతో జిల్లా విద్యారంగంలో అభివృద్ధి చెందింది. ప్రభుత్వం పాఠశాలలు, కళాశాలలు, డిగ్రీ కళాశాలలకు ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయించటంతోపాటు బోధన సిబ్బందిని నియమించింది. ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు సంగారెడ్డి జిల్లాలో విద్యారంగం అభివృద్ధికి తనదైన శైలిలో కృషి చేస్తున్నారు. ఉమ్మడి పాలనలో సంగారెడ్డి జిల్లాకు మెడికల్ కాలేజీ ఇవ్వాలని ప్రజలు కోరినా అప్పగి ప్రభుత్వాలు పట్టించుకోలేదు. సీఎం కేసీఆర్ సంగారెడ్డి జిల్లాకు మెడికల్ కాలేజీ ఇస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు సంగారెడ్డి జిల్లాకు మెడికల్ కాలేజీతోపాటు నర్సింగ్ కళాశాలను మంజూరు చేశారు. దేశంలోనే మొట్టమొదటి గిరిజన గురుకుల లా కాలేజీని కూడా సంగారెడ్డి జిల్లాలో ఏర్పాటు చేశారు.

## ఆదర్శంగా గురుకుల పాఠశాలలు, కళాశాలలు

ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ అంతటా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ గురుకుల పాఠశాలలు, కళాశాలలను ఏర్పాటు చేశారు. సీఎం కేసీఆర్ ఏర్పాటు చేసిన గురుకుల విద్యాసంస్థలు ప్రైవేటుసంస్థలకు దీటుగా విద్యార్థులకు విద్యను అందజేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాయి. సంగారెడ్డి జిల్లాలో జహీరాబాద్, లింగంపల్లిలో జనరల్ గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. ఇందులో 5 నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులు ఉన్నారు. నారాయణఖేడ్ నియోకవర్గంలోని జూకల్ ప్రాంతంలో సమీకృత విద్యాసముదాయాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో ట్రైబల్, ఆశ్రమ్, సోషల్‌వెల్ఫేర్, పాలికటెక్నిక్, మోడల్ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. సంగారెడ్డి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 12 సోషల్‌వెల్ఫేర్ గురుకుల పాఠశాలలు, కళాశాలు, 11 మహాత్మా పూలే బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, 12 మైనార్టీ గురుకులాలు ఉన్నాయి. అలాగే సంగారెడ్డి జిల్లాలో ఏడు గిరిజన గురుకులాలు ఉన్నాయి. ప్రభుత్వం రూ.9 కోట్లతో సొంత భవనాలను నిర్మించింది. ఇటీవలే రూ.5 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. పటాన్‌చెరు నియోజకవర్గం పెద్దకంజర్లలో ప్రభుత్వ గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల ఉంది. సంగారెడ్డి జిల్లాలో 17 కస్తూర్బా గురుకులాలు, పది రెసిడెన్షియల్ మోడల్ స్కూళ్లు ఉన్నాయి.

## ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించటంతోపాటు ఆధునిక విద్యాబోధనను ప్రభుత్వం ప్రవేశపెడుతోంది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం ఇంగ్లిషు మీడియం బోధనను ప్రారంభించింది. మనఊరు-మనబడి కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మారుస్తోంది.

## మన ఊరు-మనబడి

రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా, మౌలిక సదుపాయాలు కల్పించాలన్న సంకల్పంతో జనవరి 22న ప్రభుత్వం మన ఊరు-మనబడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా డిజిటల్ విద్యతోపాటు పాఠశాలల్లో ఆధునిక వసతులను కల్పిస్తున్నారు. పాఠశాలల్లో తాగునీటి వసతి, ఫర్నిచర్, ప్రహరీ, కిచెన్‌షెడ్లు, మరుగుదొడ్ల నిర్మాణం వంటి పనులు చేపడుతున్నారు. జిల్లాలో 1263 పాఠశాలలకు మన ఊరు-మనబడి మొదటి విడుతలో 441 పాఠశాలలను ఎంపిక చేశారు. 363 గ్రామీణ, 78 పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలలను ఎంపిక చేశారు. 13 పాఠశాలలు ప్రారంభం కాగా 37 పాఠశాలలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. 120 పాఠశాలలకు గ్రీన్ చాక్‌బోర్డులు, డ్యూయల్‌డెస్కులు, 65 ఫర్నిచర్ టేబుల్స్ సరఫరా చేశారు. 124 ఉన్నత పాఠశాలల్లో ఒక్కో పాఠశాలకు మూడు చొప్పున 372 ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానెల్స్ టీవీలను ఇచ్చారు. 29 పాఠశాలల్లో సోలార్‌కిట్లు ఏర్పాటు చేయగా, 78 పాఠశాలల్లో కలర్ పెయింటింగ్‌లు పూర్తయ్యాయి.

## కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు

జిల్లాలోని 17 కేజీబీవీ పాఠశాలల్లో 4,891 మంది బాలికలు చదువుతున్నారు. 17 కేజీబీవీల్లో ఆరు పాఠశాలలను ఇంటర్మీడియట్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేశారు. జిన్నారం, అందోలు, సదాశివపేట, హోతి కే, ఝరాసంగం, నారాయణఖేడ్‌లలోని కేజీబీవీలు ఇంటర్మీడియట్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ అయ్యాయి. మరో రెండు కాలేజీలు అప్‌గ్రేడ్ దశలో ఉన్నాయి.

## మధ్యాహ్న భోజన పథకం

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం రుచికరమైన ఆహారాన్ని అందజేస్తుంది. సన్నబియ్యంతో జిల్లాలోని 1,35,981 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందజేస్తుంది. మధ్యాహ్న భోజనం వండే హెల్పర్లకు ప్రభుత్వం గౌరవ వేతనాన్ని రూ.1000 నుంచి రూ.2000కు పెంచింది. ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు ప్రతిరోజూ 250 మి.లీటర్ల రాగి జావను అందజేయనున్నారు.

**నాడు — సంగారెడ్డి జిల్లాలో.. — నేడు**

| అంశం | 2014 | 2023 |
|---|---|---|
| జిమెడికల్ కాలేజీ | 0 | 1 |
| నర్సింగ్ కాలేజీ | 0 | 1 |
| గిరిజన లా కాలేజీ | 0 | 1 |
| అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల | 0 | 1 |
| రెసిడెన్షియల్ గురకులాలు | 0 | 44 |
| మన ఊరు-మనబడి స్కూళ్లు | 0 | 441 |
| మన ఊరు-మనబడి నిధులు | 0 | రూ.36.90 కోట్లు |
| మధ్యాహ్న భోజనం | దొడ్డు బియ్యం | సన్న బియ్యం |
| మధ్యాహ్నభోజనం 2023-24 బడ్జెట్ | - | రూ.16.23 లక్షలు |
| పాఠశాలలకు ట్యాబ్‌లు | 0 | 1014 |
| కేజీవీబీలు | 0 | 17 |
| కేజీవీబీ ఇంటర్మీడియట్ అప్‌గ్రేడ్ | 0 | 8 |


సంగారెడ్డి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆటవస్తువులతో ఆడుతున్న విద్యార్థులు (ఫైల్)

**తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు 2014 - 2023**

## సంగారెడ్డిలో మెడికల్, లా కాలేజీలు

ముఖ్యమంత్రి కేసీఆర్ సంగారెడ్డి జిల్లాకు మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేశారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ దవాఖాన సమీపంలో రూ.30కోట్లతో ప్రభుత్వం మెడికల్ కాలేజీని ఏర్పాటు చేసింది. 150 సీట్లతో మెడికల్ కాలేజీ ప్రారంభమైంది. ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా సంగారెడ్డి మెడికల్ కాలేజీ తరగతులను ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. 60 సీట్లతో ప్రభుత్వం సంగారెడ్డిలో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేసింది. ఇటీవలే ఆర్థిక వైద్యారోగ్యశాఖల మంత్రి హరీశ్‌రావు సంగారెడ్డిలో నర్సింగ్ కాలేజీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దేశంలోనే మొదటిసారిగా సంగారెడ్డిలో 60మంది విద్యార్థులతో గిరిజన రెసిడెన్షియల్ లా కాలేజీని ప్రారంభించారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు గిరిజన లా కాలేజీలో చదువుతున్నారు. సాంకేతిక విద్యను బలోపేతం చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం సంగారెడ్డిలో అగ్రికల్చర్ ఇంజినీరింగ్ కళాశాల, అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటు చేసింది. సుల్తాన్‌పూర్‌లోని జేఎన్‌టీయూ కాలేజీకి అనుబంధంగా యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఫార్మాసూటికల్ సైన్స్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో బీ ఫార్మసీ, ఎంఫార్మసీ కోర్సులను ప్రారంభించారు.

## ఆంగ్ల మాధ్యమ పాఠశాలలు

మాతృభాషపై ప్రావీణ్యాన్ని పెంచుతూనే ఆంగ్లభాషపై విద్యార్థులకు పట్టు పెంచేందుకు ప్రభుత్వం ఇంగ్లిషు మీడియం పాఠశాలలను ప్రారంభించింది. 2022-23 సంవత్సరం నుంచి 1263 పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధన ప్రక్రియను ప్రారంభించింది. ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన కారణంగా 10,000 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. అలాగే ప్రభుత్వం ప్రతిఏటా విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేస్తోంది. రెండు జతల యూనిఫామ్స్ అందజేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల విద్యార్థులకు నోట్ పుస్తకాలనూ ఉచితంగా అందజేయనుంది.

## 'పది'లో మెరుగైన ఫలితాలు

2022-23 విద్యాసంవత్సరం పదోతరగతి ఫలితాల్లో సంగారెడ్డి జిల్లా రాష్ట్రంలో మూడోస్థానంలో నిలిచింది. జిల్లా కలెక్టర్ శరత్ పదో తరగతిలో మెరుగైన ఫలితాలు వచ్చేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. టెన్త్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా టీచర్స్ హ్యాండ్‌బుక్‌ను తయారు చేయించారు. పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతోపాటు విద్యార్థులకు అల్పాహారం అందజేశారు. 97.29శాతం ఉత్తీర్ణతతో సంగారెడ్డి జిల్లా పది ఫలితాల్లో రాష్ట్రంలో మూడోస్థానంలో నిలిచింది.

## సీవీ రామన్ సైన్స్ మ్యూజియం

విద్యార్థులను సైన్స్ ప్రయోగాల వైపు మళ్లించేందుకు ప్రభుత్వం రూ.2.10 కోట్లతో సంగారెడ్డి, నారాయణఖేడ్‌లలో సైన్స్ మ్యూజియంలను ఏర్పాటు చేసింది. జిల్లాలోని విద్యార్థులను సైన్స్ మ్యూజియానికి తీసుకొచ్చి సైన్స్‌పై విద్యార్థులకు ఆసక్తి పెరిగేలా విద్యాశాఖ చర్యలు తీసుకుంటుంది. జాతీయ సైన్స్ పోటీలకు 23మంది విద్యార్థులు సంగారెడ్డి నుంచి వెళ్లారు. అందులో నలుగురు విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వీరిలో ఇద్దరు జపాన్‌లో విద్యా విహారయాత్రకు ఎంపికయ్యారు.



మెదక్ మున్సిపాలిటీ: మన ఊరు-మన బడిలో భాగంగా సుందరంగా తయారైన అల్లాదుర్గం మండలం కైదంపల్లి పాఠశాల

- కేజీ టు పీజీ వరకు ఉచిత నాణ్యమైన విద్య
- మన ఊరు-మనబడితో మారిన ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు
- కార్పొరేట్‌స్థాయిలో రూపుదిద్దుకున్న ప్రభుత్వ పాఠశాలలు
- విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం
- ప్రభుత్వ స్కూళ్లలో మారిన మధ్యాహ్నం భోజనం మెనూ
- గతేడాది నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో అమల్లోకి ఆంగ్ల మాధ్యమం
- ఈ ఏడాది ప్రభుత్వ స్కూళ్లల్లో రాగి జావ


మెదక్ మున్సిపాలిటీ: మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు


# విద్యారంగంలో విప్లవం




మెదక్ మున్సిపాలిటీ, జూన్ 19: సర్కారు బడుల్లో కార్పొరేట్ విద్యను అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మకమైన ప్రగతి సాధించింది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతుంది. విద్యాభివృద్ధిలో భాగంగా విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన, వసతులు, మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ విద్యను అందించడంతోపాటు సన్న బియ్యంతో కూడిన రుచికరమైన భోజనాన్ని అందిస్తుండడంతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల వైపు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమైన కొద్దిరోజులకే అడ్మిషన్లు ఫుల్ అంటూ బోర్డులు పెడుతున్నారు. కేజీబీవీలు, గురుకుల పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, మైనార్టీ గురుకులాల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. అలాగే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్ అందజేస్తున్నారు. ఈ ఏడాది నుంచి స్కూళ్లల్లో రాగి జావ కూడా ఇవ్వనున్నారు.

## నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వ ప్రోత్సాహం

పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యనందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. గురుకులాలు, కస్తూర్బాలు, మోడల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తూ సకల సౌకర్యాలు కల్పిస్తోంది. సన్నబియ్యంతో రుచికరమైన భోజనం పెడుతోంది. క్రీడల్లో రాణించడానికి తగిన శిక్షణతోపాటు ఇతర అంశాల్లో సైతం ప్రోత్సాహం అందిస్తోంది. ఒక్కో విద్యార్థికీ ఏడాదికి రూ.1.25 లక్షలను ప్రభుత్వ ఖర్చు చేస్తుంది. ఉచితంగా పుస్తకాలు, నోట్ బుక్స్, కాస్మోటిక్ చార్జీలను సైతం ప్రభుత్వం కల్పిస్తుంది. వీటితోపాటు కరాటే, యోగా, చిత్రలేఖనం, వృత్తి విద్య కోర్సులను సైతం నేర్పిస్తుంది.


మెదక్ మున్సిపాలిటీ: మన ఊరు-మనబడిలో భాగంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన బెంచి డెస్కులు

### 12 రకాల మౌలిక వసతులు.. సదుపాయాలు

'మనఊరు-మనబడి' పథకం కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో నీటి వసతితోకూడిన మరుగుదొడ్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యం, అవసరమైన ఫర్నిచర్, పెయింటింగ్, పాఠశాలల మరమ్మతులు, గ్రీన్ చాక్ బోర్డులు, ప్రహరీలు, వంటగది, ఆదనపు తరగతి గదులు, ఉన్నత పాఠశాలల్లో డైనింగ్ హాళ్లు, డిజిటల్ విద్య అమలుకు అవసరమైన పాఠశాలల్లో చేపడుతున్నారు. అంతేగాకుండా 12 రకాల మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కార్పొరేట్ స్థాయి పాఠశాలల భవనాలను తలదన్నేలా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు.

### 'మన ఊరు-మనబడి'లో 313 పాఠశాలలు.. రూ. 130 కోట్ల నిధులు..

విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. సర్కార్ బడులకు సకలహంగులు కల్పించి కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులోభాగంగా 2022లో 'మన ఊరు-మనబడి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ఆదేశాలతో మెదక్ జిల్లాలోని సర్కారుబడుల పరిస్థితిపై విద్యాశాఖ సమగ్ర నివేదిక తయారుచేసి పంపింది. తొలి విడుతలో ప్రతి జిల్లాలో పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు అధికారులు నిర్ణయించారు. జిల్లాలోని తొలి విడుతలో 313పాఠశాలలను ఎంపిక చేసి రూ.130 కోట్ల నిధులు మంజూరు చేసింది. తొలి విడుతలో ఎక్కువమంది(700 నుంచి వెయ్యి వరకు) విద్యార్థులు ఉండి సరైన వసతులు లేని పాఠశాలలను ఎంపిక చేసింది. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధన ప్రారంభించడంతోపాటు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మన ఊరు-మన బడి కింద ఆదివారం వరకు 18 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. మూడు పాఠశాలలను ఇప్పటికే ప్రారంభించారు. మిగతా 15 పాఠశాలలను ఈనెల 20న విద్యాదినోత్సవం రోజున ప్రారంభించనున్నారు. మిగతా పాఠశాలల్లో 80శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. త్వరలోనే పనులు పూర్తి చేయనున్నట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. విద్యాదినోత్సవం రోజున పనులు పూర్తయితే15 పాఠశాలలు ప్రారంభించనున్నారు.

కార్పొరేట్ స్థాయి విద్య అందుతుండడంతో గురుకుల పాఠశాలల్లో పోటీ పెరిగింది. పట్టణాలతోపాటు గ్రామాల్లోని తల్లిదండ్రులు తమ పిల్లలను గురుకుల పాఠశాలల్లో చేర్పిస్తున్నారు.

## పది నుంచి ఇంటర్ వరకు అప్‌గ్రేడ్..

గతంలో కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో 6 నుంచి పదోతరగతి వరకు మాత్రమే చదువుకునే అవకాశం ఉండేది. తరువాత ఇంటర్ ఆపై చదువులకూ వాటిలోనే అవకాశం కల్పించింది. మెదక్ జిల్లాలో 15 కేజీబీవీ విద్యాలయాలు ఉండగా వాటిలో మెదక్, చేగుంట, నర్సాపూర్, అల్లాదుర్గం కేజీబీవీలను ప్రభుత్వం 2021-22 విద్యాసంవత్సరం నుంచి అప్‌గ్రేడ్ చేసింది. నిరుపేద విద్యార్థుల కోసం ప్రభుత్వం కేజీబీవీలను అప్‌గ్రేడ్ చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతుంది. ఇవేకాకుండా సాంఘిక సంక్షేమ గురుకులాలను సైతం ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేశారు. 6వ తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థులు ఇంటర్ పూర్తయ్యే వరకు కార్పొరేట్‌ను తలదన్నే నాణ్యమైన విద్యనభ్యసిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో పౌష్టిక భోజనం, సాయంత్రం స్నాక్స్, వారానికి మూడుసార్లు మాంసం, గుడ్లు అందిస్తున్నారు. విద్యార్థినులకు 3 నెలలకు అవసరమయ్యే హెల్త్ కిట్స్‌ను కూడా విద్యాసంవత్సరంలో మూడు సార్లు అందిస్తారు. అలాగే ఈఏడాది నుంచి రాగిజావాను కూడా ఇవ్వనున్నారు.

## మెదక్ జిల్లాలో 1,062 ప్రభుత్వ పాఠశాలలు

మెదక్ జిల్లాలో 1,062 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా అందులో 636 ప్రాథమిక, 184 ప్రాథమికోన్నత, 242 ఉన్నత పాఠశాలలు, 15 కేజీబీవీలు, 7 మోడల్ స్కూళ్లు, 1 టీఆర్ఐఈఎస్, 1 అర్బన్ రెసిడెన్సియల్ స్కూల్, 4 సోషల్ వెల్ఫేర్, 1 టీడబ్ల్యు(డిపార్ట్‌మెంట్) స్కూల్, 5 టీడబ్ల్యు(సొసైటీ) స్కూళ్లు, 7 బీసీ వెల్ఫేర్ పాఠశాలలు, 2 టీఎమ్ఆర్ఈఐ తదితర పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 1,27,706 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

## 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 16 ఉన్నాయి. వీటితోపాటు కస్తూర్బా, సోషల్ వెల్ఫేర్, మైనార్టీ వెల్ఫేర్, ట్రైబర్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు కూడా నాలుగు ఉన్నాయి. పాలిటెక్నిక్ కళాశాలలు 3 ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గురుకులాల్లో 6 నుంచి పదోతరగతి విద్యార్థులతోపాటు జూనియర్, డిగ్రీ విద్యార్థులకు ప్రతి ఒక విద్యార్థికీ ప్రతిఏటా రూ. 1.20 లక్షలు ఖర్చు చేస్తోంది. ఇవేగాకుండా ఇంగ్లిషు బోధనతోపాటు దుస్తులు, పుస్తకాలు ఉచితంగా ఇవ్వడంతో గురుకులాల్లో ప్రవేశాల సంఖ్య పెరిగింది.

## మెదక్ జిల్లాలో 16 గ్రంథాలయాలు

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు కావాల్సిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. మెదక్ జిల్లా కేంద్ర గ్రంథాలయంతో కలుపుకుని 16 శాఖల గ్రంథాలయాలు జిల్లాలో ఉన్నాయి. రంగంపేట, నార్సింగిలలో గ్రామ గ్రంథాలయాలు ఉన్నాయి. నూతనంగా ఏర్పాటైన మండలాలు నిజాంపేట, నార్సింగి, చిలిపిచేడ్, మనోహరాబాద్, హవేళీఘనపూర్‌లలో నూతన గ్రంథాలయాలను ఏర్పాటు చేసే ఆవశ్యకత ఉంది. జిల్లాల పునర్విభజనలో భాగంగా మెదక్‌లో జిల్లా కేంద్రం ఏర్పాటుకావడంతో నూతనంగా టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ నిధులు రూ.2.50 కోట్లతో జిల్లా గ్రంథాలయాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికీ 80శాతం పనులు పూర్తయ్యాయి. జిల్లా గ్రంథాలయంలో రెండు లక్షలకుపైగా పుస్తకాలు ఉన్నాయి. గ్రూప్-1తోపాటు వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు జిల్లా గ్రంథాలయంలో ప్రత్యేకంగా హాల్ ఏర్పాటు చేశారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న సుమారు 150మంది అభ్యర్థులకు మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ప్రతిరోజూ రెండు పూటలా భోజనం ఏర్పాటు చేస్తున్నారు.


మెదక్ మున్సిపాలిటీ: గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నఅభ్యర్థులు